## క్లుప్తంగా

### ఆర్డీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్

**జంగారెడ్డిగూడెం:** స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ ఎంవీ రమణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో 13 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు ఉన్నాయని ఆమె తెలిపారు. పునరావృతం కాని విధంగా ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. పరిష్కరించదగ్గ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో తెలియజేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కార తీరు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎంపిక


చాంబర్ నూతన కార్యవర్గ సభ్యులు

**కొయ్యలగూడెం:** స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన సభ్యుల ఎంపిక సోమవారం వాసవి ఆడిటోరియంలో నిర్వహించారు. అధ్యక్షుడు మద్దు మోహన్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ వ్యాపార, వర్తక కేంద్రాల్లోని అన్ని సామాజిక వర్గాల వారికి చాంబర్‌లో ప్రాతినిధ్యం కల్పించామని మోహన్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గొలిశెట్టి శ్రీనివాసరావు, కర్పూరం సత్యనారాయణ, నిమ్మ జగదీశ్వరరావు, బొమ్మ దుర్గ బాబు, చిరపూరిసాయి, నీలం వెంకటేశ్వరరావు, కంభం పాటి సత్యనారాయణ, గెద్దం సత్యనారాయణ, గంటా లక్ష్మణరావు, నాయుడు లీలా కాంత్ తదితరులు ఎంపికైన వారిలో ఉన్నారు.

### చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 24వ చండీహోమం నిర్వహించామని ఆలయ కమిటీ పేర్కొంది. అర్చకులు విజయదుర్గమ్మ అమ్మవారికి, పంచభూత మరకత లింగేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. చండీహోమం వేదోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ అధికారుల దాడులు

**చింతలపూడి :** స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోతునూరు గ్రామంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒక మహిళను అరెస్ట్ చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహణ కేసులో ముద్దాయి పరసా రాంబాబుతో పాటు అదే గ్రామానికి చెందిన సారా పాత కేసులో ముద్దాయి బాలిన ఏడుకొండలును తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

**మద్యం స్వాధీనం**

**వేలేరుపాడు:** మండలంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న నలుగురు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. తెలంగాణ మద్యం 101, ఆంధ్ర మద్యం 7 సీసాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీఐ పీఎస్‌డీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తికి గాయాలు

**జంగారెడ్డిగూడెం:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కె.వెంకినాయుడు పట్టణ శివారు రిలయన్స్ బంక్ సమీపంలో ఉన్న పట్టణానికి చెందిన సోమేశ్వరరావు గేదెల మకాం వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం బహిర్భూమికి రోడ్డుపైకి వచ్చి నడుచుకుంటూ వెళుతుండగా, కొయ్యలగూడెం నుంచి అశ్వారావుపేట వైపు వెళుతున్న మోటార్‌సైకిల్ ఢీకొందన్నారు. దీంతో కుడి కాలు విరిగిన వెంకినాయుడును స్థానిక ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

### అభయ రక్షక పోలీస్ దళం

**ఏలూరు టౌన్:** ఏలూరు జిల్లాలో మహిళలు, విద్యార్థినులు ఆపదలో అండగా నిలిచేందుకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేక శ్రద్ధతో అభయ మహిళా పోలీస్ రక్షక దళం ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్సై క్రాంతి ప్రియ నగరంలో అభయ రక్షక దళం గస్తీపై అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు కొత్తబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఏలూరు వచ్చే సందర్భంలో ఆటోల్లో ప్రయాణిస్తూ ఉంటారని, ఒంటరి మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లుకు ఉందని అన్నారు.

# దళారుల ప్రమేయం.. రైతులకు నష్టం

- ప్రతికూల వాతావరణం
- ధాన్యం కొనుగోలులో ఇష్టారాజ్యం
- రైతుకు బస్తాకు రూ.100 నష్టం


లింగపాలెం ఏఎంసీ గోడౌన్ల వద్ద ఆరబెట్టిన ధాన్యం


ఇప్పలపాడు సమీపంలో ధాన్యం రాశులు


వీరన్నపాలెం సమీపంలో ఆరబెట్టిన ధాన్యం

**చింతలపూడి / బుట్టాయగూడెం :** రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతోన్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. దీంతో రైతులు దళారులు, ప్రైవేట్ రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు తమకు ఇష్టమొచ్చిన ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తుపాను భయంతో రైతులు 10 రోజులుగా వరి కోతలను ముమ్మరం చేశారు. కల్లాల్లో ఉన్న ధాన్యం ఆరబెట్టుకునే దారిలేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దళారులు రంగంలోకి దిగారు. ధాన్యంలో తేమ శాతాన్ని అలుసుగా చేసుకుని తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారని రైతులు వాపోతున్నారు. ముందుగానే రైతులతో ఒప్పందం కుదుర్చుకుని, రైతుల పేరుతోనే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. రైతుల ఖాతాల్లో సొమ్ము జమైన వెంటనే దళారులు తమ కమీషన్‌ను రైతుల నుంచి వసూలు చేసుకుంటున్నారు.

**చింతలపూడి నియోజకవర్గంలో..**

ఈ ఏడాది 24,608 ఎకరాల్లో వరి సాగు చేశారు. మండలాల వారీగా చింతలపూడిలో 13,174 ఎకరాల్లో, జంగారెడ్డిగూడెంలో 11,200, లింగపాలెంలో 6,473, కామవరపుకోట మండలంలో 33,676 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 77,600 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు 2,373 మంది రైతుల నుంచి 20,225.28 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అధికారులు చెబుతున్నారు. దళారులు ధాన్యంలో తేమ శాతాన్ని అలుసుగా చేసుకుని రైతుల నుంచి రూ.100 నుంచి రూ.150కు తక్కువ చేసి ధాన్యం కొంటున్నారని రైతులు వాపోతున్నారు. కామవరపుకోట మండలంలో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభమైనా.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో దళారులు ప్రభుత్వం గుర్తించిన కొనుగోలు కేంద్రాల్లోనే పాగా వేస్తున్నారు.

**పోలవరం నియోజకవర్గం పరిధిలో..**

24247 ఎకరాల్లో వరిసాగు చేశారు. బుట్టాయగూడెం మండలంలో 5, పోలవరం 6, కొయ్యలగూడెం 10, వేలేరుపాడు 2, కుక్కునూరు 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం మండలంలో 1700 టన్నులు, పోలవరం మండలంలో 2300 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300 కనీస మద్దతు ధర ప్రకటించగా, దళారులు మాత్రం ఏ గేడ్ రకం రూ.1640, సాధారణ గ్రేడ్ రూ.1440కు రైతుల నుంచి ధాన్యం కొంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారానే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటివరకూ ఇప్పలపాడు, జైనవారిగూడెం, రెడ్డిగణపవరం, ఎస్ఆర్ పాలెం కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేశాం. బుట్టాయగూడెంలో కొనుగోలు ప్రారంభం కాలేదు.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

### ప్రభుత్వమే కొనాలి



నేను రెండెకరాల్లో వరిపంట సాగు చేశాను. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు నాకు తెలియదు. మబ్బులు పట్టి వర్షాలు కురుస్తాయనే భయంతో దళారులకు నా పంటను అమ్ముకున్నాను. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. అదే ప్రభుత్వం కొనుగోలు చేస్తే నా కష్టానికి ఫలితం దక్కేది. ప్రభుత్వమే ధాన్యం కొని రైతులను ఆదుకోవాలి.

– కొమరం బొజ్జి, రైతు, వీరన్నపాలెం, బుట్టాయగూడెం మండలం

## బాల్యవివాహాల్లో రాష్ట్రం రెండో స్థానం


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుమార్

**కొయ్యలగూడెం:** బాలిక వివాహాల విషయంలో మన రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కిశోర బాలికా వికాసం (2.0) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం కిశోర బాలికా వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇందులో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు అవగాహన కల్పించాలని, పెళ్లి మాత్రమే కాదు నిశ్చితార్థం కూడా తీవ్రమైన నేరంగా పరిగణింపబడుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్యవివాహాలు చేస్తుంటే కాల్ సెంటర్ నంబర్ 1098కి తెలియజేయాలన్నారు. బాల్య వివాహ నిషేధం, ఆత్మరక్షణ, జీవనోపాధి అవకాశాలు, లింగ పక్షపాతం, పోషకాహారం, ఆరోగ్యం, విద్య ఋతు సంబంధ హైజెనిక్, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, డ్రాపౌట్స్ బాలికలను గుర్తింపు తదితర అంశాలపై అధికారులకు సిబ్బందికి వివరించారు. ఈవోపీఆర్‌డీ జి.సతీష్, ఎంఈఓ జె.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక కబ్జాపై ఆందోళన


రాజవరంలో శ్మశాన వాటిక వద్ద ఆందోళన చేస్తున్న మైనారిటీలు

**కొయ్యలగూడెం:** రాజవరం పంచాయతీలోని శ్మశాన వాటిక కబ్జాకి గురవుతోందంటూ మైనారిటీలు సోమవారం ఆందోళన నిర్వహించారు. నూర్ బాషా దూదేకుల శ్మశాన వాటిక 33 సెంట్లు ఉండేదని, ఇప్పుడది క్రమేపీ కబ్జాకి గురవుతోందని పేర్కొన్నారు. ఊర్లోని మురుగునీరు బరల్ గ్రౌండ్‌లోకి రావడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని, దీంతో బరేల్ గ్రౌండ్లో చేసే కార్యక్రమాలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. సీసీ డ్రెయిన్, గ్రావెల్ రోడ్డు నిర్మించాలని కోరినా ప్రయోజనం లేదని సంఘ అధ్యక్షుడు షేక్ మీరా సాహెబ్ అన్నారు. స్పందనలో అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, మురుగునీటి వ్యవస్థ ఉండడం వల్ల శ్మశానంలోకి వచ్చే జంతువుల వల్ల పవిత్రతకు భంగం వాటిల్లుతోందని వివరించారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సంఘ సభ్యులు కోరారు. షేక్ మస్తాన్ వలీ, ఎస్ హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

### వసతిగృహాల్లో సమస్యల తిష్ట

**బుట్టాయగూడెం:** స్థానిక గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహాన్ని సోమవారం బీజేపీ నాయకుల బృందం సందర్శించింది. వసతిగృహంలోని భోజన శాల, మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం నాయకులు కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచన మాల, సోము హరినారాయణలు మాట్లాడుతూ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరిందన్నారు. భోజనశాల లేక విద్యార్థులు ఆరుబయటే భోజనాలు చేసే పరిస్థితి నెలకొందని తెలిపారు. మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవని, నైట్ వాచర్ లేరని చెప్పారు. బాలికల కళాశాల వసతిగృహంలో కూడా పలు సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. సమస్యలను ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

## మధ్యాహ్న భోజనంలో తగ్గిన నాణ్యత


విద్యార్థులతో మాట్లాడుతున్న యర్రా మధు

**వేలేరుపాడు:** స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు తగ్గాయని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఏలూరు జిల్లా కార్యదర్శి యర్రా మధు ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. భోజన పథకాన్ని 9, 10 తరగతిలో కూడా వర్తింపజేయాలని కోరారు. విద్యార్థులు భోజనం సరిగ్గా లేదని ఫిర్యాదు చేయడం వల్ల సోమవారం స్కూల్‌ను సందర్శించామని చెప్పారు. అనంతరం హెచ్ఎం, మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో మాట్లాడి విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మధు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో శివాలయాల్లో పూజలు


జెడ్పీ బాలుర హైస్కూల్ వద్ద శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం ముగియడంతో పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బైనేరు ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట శ్రీరాజరాజేశ్వరస్వామి, జెడ్పీహైస్కూల్ వద్ద ఉన్న శివాలయం, గుహాలయంలోని ఓంకారేశ్వరస్వామి, నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయదుర్గమ్మ, లలితాదేవి ఆలయాల్లోని శివలింగాలకు పూజలు నిర్వహించారు. పోలిస్వర్గం కార్యక్రమంలో భాగంగా మహిళలు స్థానిక బైనేరు కాలువ, కొలనులో దీపాలు విడిచిపెట్టారు.

**ఘనంగా శివపార్వతుల కళ్యాణం**

**కుక్కునూరు:** స్థానిక శివాలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అర్చకుడు నవీన్ శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపార్వతుల కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పోలిస్వర్గం సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాలకు విచ్చేసి కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం గోదావరి నదిలో, సమీపంలోని వాగుల్లో దీపాలను వదిలిపెట్టారు.

**శివయ్యకు అభిషేకాలు**

**ద్వారకాతిరుమల:** కార్తీక మసోత్సవాల ముగింపును పురస్కరించుకుని క్షేత్ర పాలకుని ఆలయంలో సోమవారం శివదేవునికి అర్చకులు విశేష పూజలు చేశారు. తొలుత గర్భాలయంలో కొలువైన స్వామి వారికి అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పోలి పాడ్యమి సందర్భంగా మహిళా భక్తులు శ్రీవారి పుష్కరణిలో కార్తీక దీపాలు వదిలే కార్యక్రమం, అనివార్య కారణాల వల్ల రద్దయ్యింది. దాంతో ఇళ్ల వద్దే ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు.


ద్వారకాతిరుమల శివాలయంలో అభిషేకాలు

## శ్రీశైలానికి శివ స్వాములు పయనం


ఇరుముడిధారణ పూజలు చేస్తున్న శివస్వాములు

**ద్వారకాతిరుమల:** శివ దీక్షాదారులు హరోం.. హర అంటూ చేసిన శివ నామస్మరణలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో పలువురు శివ దీక్షాదారులు సోమవారం ఇరుముడులను ధరించారు. తొలుత ఆలయ ముఖ మండపంలో శివ నామస్మరణలతో భజనలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, గురుస్వాముల వేద మంత్రోచ్ఛరణల నడుమ బంధుమిత్రుల సమక్షంలో ఇరుముడి ధారణ చేశారు. ఇరుముడులను శిరస్సుపై పెట్టుకుని క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. అమ్మవారి దర్శనానంతరం అక్కడి నుంచి శ్రీశైలం క్షేత్రానికి వివిధ వాహనాలపై వెళ్లారు.

## లింగ వివక్ష అనాగరికం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** అన్ని రంగాల్లోనూ పురుషులతో పాటు సమానంగా రాణిస్తోన్న స్త్రీలను తక్కువ చేసి చూడడం తగదని, లింగ వివక్షత అనాగరికమని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అన్నారు. నవంబర్ 25 నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ కాంపెయిన్ నయీ చేతన 3.0లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై వి.కాంతి ప్రియ మాట్లాడుతూ స్త్రీలపై హింసను నిరసిస్తూ, అలాంటి ఘటనలు జరిగినప్పుడు తెలియజేయాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్‌ను విద్యార్థులకు తెలిపారు. అనంతరం కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు మాట్లాడారు. వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకట్రావు, ఎస్ పరమేశ, టి.వెంకట దుర్గాప్రసాద్, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

### ఏఆర్ డీఎస్పీకి అభినందన

**ఏలూరు టౌన్:** సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో 25వ ఆలిండియా ల్యాండ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరిరావును ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అభినందించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీఎస్పీ శ్రీహరిరావు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. టెన్నిస్ పోటీల్లో విజయం సాధించిన ఏఆర్ డీఎస్పీని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ ఉన్నారు.

## టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలి


టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న జీఎంఎస్‌కే లక్ష్మీ సుజన

**ద్వారకాతిరుమల:** స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు సచివాలయం -2లో సోమవారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి లక్ష్మీ సుజన అవగాహన కల్పించారు. టెక్నాలజీతో ఎంత ఉపయోగం ఉందో, అంత అనర్థం ఉందని చెప్పారు. విద్య, వైద్యం, రీసెర్చ్, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత విలువైన సమాచారాన్ని ఇంటర్నెట్ ద్వారా పొందగలుగుతున్నామన్నారు. ఫేస్‌బుక్‌లో పెట్టే ఫొటోలు మార్ఫింగ్‌లకు గురవుతాయని, సాధ్యమైనంత వరకు వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయకపోవడం మంచిదని సూచించారు. సైబర్ ఫ్రాడ్ లోన్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయిని లావణ్య, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

### ట్రూ అప్ పేరిట ప్రజలపై విద్యుత్ భారం

**కుక్కునూరు:** ప్రభుత్వం ట్రూ అప్ పేరిట కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం మోపిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రంగారెడ్డి విమర్శించారు. సోమవారం మారేడుబాక గ్రామంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా అనుబంధ జిల్లా స్థాయి ప్రజాసంఘాల నిర్మాణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు ప్రజా సంఘాల జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడుగా ఇందూరు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా బి.సత్యనారాయణ, కోశాధికారిగా కె.బుచ్చయ్య, ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులుగా కట్టం వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా పెరుమాళ్ల శ్రీనును ఎన్నుకున్నారు. అరుణోదయ జిల్లా అధ్యక్షుడిగా కట్ట ముత్యాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గద్దాల ముత్యాలరావు తదితరులను ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే గౌస్ పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి

**కొయ్యలగూడెం:** వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, వేదాంతపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దండాబత్తుల రామారావు (78) సోమవారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యంతో ఆయన కాకినాడ జిల్లా పత్తిపాడులో మృతి చెందారు. వేదాంతపురం గ్రామ ఉప సర్పంచ్‌గా 15 సంవత్సరాలు, సర్పంచ్‌గా పదేళ్ల పనిచేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో సేవలు అందించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాష్ట్ర యువజన విభాగం నాయకులు కరాటం కృష్ణ స్వరూప్ రామారావు భార్యను, కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. రామారావు అంత్యక్రియలు మంగళవారం వేదాంతపురం గ్రామంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు

## మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్


చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణబాబు, ఎస్సై రామకృష్ణ, చిత్రంలో నిందితులు

**జంగారెడ్డిగూడెం రూరల్:** మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ కృష్ణబాబు తెలిపారు. లక్కవరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆ కేసు వివరాలను ఎస్సై రామకృష్ణతో కలిసి ఆయన వివరించారు. గత నెల 28న తన మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన కొలూరి బాల పవన్ కిషోర్ ఫిర్యాదు చేశారన్నారు. ఆదివారం పుట్లగట్లగూడెం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, చోరీ చేసిన మోటార్ సైకిళ్లతో ఇద్దరు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులు భీమడోలుకు చెందిన మందపాటి జీవన్‌కుమార్, బొమ్ము వెంకటేశ్వరరావులు చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. మోటార్ సైకిళ్ల చోరీకి సంబంధించి గతంలో నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో వీరిపై కేసులు ఉన్నాయన్నారు. జీవన్‌కుమార్ గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడి ఏలూరు సబ్‌జైల్‌కి వెళ్లి వచ్చాడని తెలిపారు. వీరిని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ కృష్ణబాబు, ఎస్సై రామకృష్ణలతో పాటు సిబ్బందిని డీఎస్పీ యు.రవిచంద్ర అభినందించారు.